క్లుప్తంగా

నిధుల కోసం ఎమ్మెల్యే వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మెట్టు బ్రిడ్జి నిర్మాణంతో పాటు తిమ్మాపూర్ పద్మనాభపల్లి రోడ్డుకు రూ.25 కోట్లు, మొండిచింత నుంచి బేగంపేట రోడ్డు విస్తరణ కోసం రూ.7కోట్లు, చేగుంట మండలంలోని బోనాల్ రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజకు సిద్ధమైన పీఠాధిపతి ఆనందం, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో కోట్ల నల్లయార్యుల ఆశ్రమ నిర్మాణానికి సోమవారం మోమిన్‌పేట పీఠాధిపతి రమేశ్‌ఆర్యులు, ముంగిమల్ల పీఠాధిపతి కోట్ల ఆనందం సమక్షంలో భూమిపూజ చేశారు. అనంతరం భజన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మికతోనే మానసిక సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్మంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలో సోమవారం సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పీఎం జీవనజ్యోతి, సురక్ష భీమా, వ్యవసాయ సాగులో అగ్రిగోస్ పిచికారి, ఆయుష్మాన్ భారత్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..
మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అధికారులు కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో సోమవారం వారు లఘు చిత్రం ప్రదర్శించి ప్రజలకు వివరించారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు యాదాగౌడ్, యాదయ్య, ఏఎస్‌ఎం సంతోష, సుభాషిణి, గ్రామ కార్యదర్శి సవిత, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.

నిరుద్యోగ సర్వే..



వివరాలు నమోదు చేయిస్తున్న నిరుద్యోగులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో సోమవారం నిరుద్యోగ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వాలెంటీర్ కల్పన మాట్లాడుతూ గ్రామంలో యువతీ యువకుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్టు చెప్పారు. ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ తీసుకొని వస్తే కేవైసీ ఆధారంగా నిరుద్యోగుల వివరాలు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

50 మందిపై విద్యుత్ విజిలెన్స్ కేసులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో మీటర్ రన్నింగ్‌లో లేకుండా విద్యుత్ వినియోగించిన 50 మందిపై విజిలెన్స్ కేసులు నమోదయ్యాయి. వారంతా గడువులోగా జరిమానా చెల్లించాలని, లేకపోతే అరెస్టుచేసి జైలుకు తరలిస్తామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

అంతా రామమయం

- జై శ్రీరామ్ స్మరణతో మారుమోగిన గ్రామాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



నిజాంపేట(మెదక్): చల్మెడ గ్రామంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



చేగుంట(తూప్రాన్): సీతారామ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా గ్రామాలు శ్రీరామ స్మరణతో మారుమోగాయి. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో పూజల అనంతరం అన్నదానం, శోభాయాత్రలు నిర్వహించారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని పురాతన కోదండరామస్వామి ఆలయంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీసేవ నిర్వహించగా.. ప్రజలు స్వామికి మంగళ హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేగోడ్‌లో..
అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రమైన రేగోడ్‌లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ చేసి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

రామాయంపేటలో..
అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా రామాయంపేటలో వీహెచ్‌పీ ప్రతినిధులు సోమవారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించగా, మహిళలు కోలాటం, చిన్నారులు సీతారాముల వేషధారణతో ఆకట్టుకున్నారు.

కొల్చారంలో..
మండల వ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహించిన బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాలన్నీ కాషాయమయంగా మారాయి. జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. దేవాలయాల వద్ద శ్రీరాముల వారికి అభిషేకం ,పూజా కార్యక్రమాలు ,శోభాయాత్ర, శ్రీరాముని జపం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

శిశుమందిర్‌లో భజనలు..
మెదక్ కలెక్టరేట్: అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మెదక్‌లోని బ్రాహ్మణ వీధిలో గల సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులు ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేడుకలు..
చిన్నశంకరంపేట(మెదక్): అయోధ్యలో శ్రీబాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నార్సింగి వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. శేరిపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో నార్సింగి ఎస్‌ఐ మోహినొద్దీన్‌తో పాటు సర్పంచ్ మల్లేశం, హనుమాన్ సేవా సమితి అధ్యక్షుడు వెంకట్‌స్వామిగౌడ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వల్లూర్, బీమ్‌రావుపల్లి, సంకాపూర్, జప్తిశివనూర్, నర్సంపల్లి గ్రామాలలో శ్రీరామ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్, సీతారామ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నృత్యం చేస్తూ ముందుకు సాగారు.

కౌడిపల్లిలో.. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక శ్రీఅభయ సీతారామాలయం వద్ద పూజలుచేసి శ్రీఆంజనేయస్వామి ఆలయం వరకు శ్రీరాముని ఫ్లెక్సీతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. మహ్మద్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వర ఆలయం, వెల్మకన్నలో శ్రీరాయగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం, వెంకటపూర్(ఆర్)లోని శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలుచేసి అన్నదానం చేశారు.

నిజాంపేటలో.. స్థానిక హనుమాన్ విగ్రహానికి చందనాభిషేకం, శ్రీరాముడి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో తిరుమలయ్య స్వామి ఆలయం నుంచి సీతారాముల విగ్రహాలను ఊరేగించి వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మంజీర విద్యాలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి అయోధ్యలోని రామ విగ్రహ ప్రతిష్ఠను వీక్షించారు. పురోహితులు వేలేటి రామ్మోహన్, సర్పంచ్‌లు గెరిగంటి అనూష, నరసింహారెడ్డి, అమర సేనారెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో.. స్థానిక హనుమాన్ దేవాలయంలో హోమం, కల్యాణం నిర్వహించారు. అలాగే సీతారామ కాలనీలోని ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇబ్రహీంపూర్ గ్రామంలో వేంకటేశ్వరుని ఆలయంలో కిషన్‌రావ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు.

టేక్మాల్‌లో.. అయోధ్యలోని శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్ని గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హన్‌మాన్ దేవాలయాల వద్ద చందనం పెట్టి, శ్రీరాముడి చిత్రపటాలతో ర్యాలీలు నిర్వహించారు.



శివ్వంపేటలో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు



అల్లాదుర్గంలో శ్రీరాముని శోభాయాత్ర



శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో..



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో ర్యాలీ..



మెదక్ కలెక్టరేట్: భజన చేస్తున్న విద్యార్థులు



కౌడిపల్లి(నర్సాపూర్): శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తున్న గ్రామస్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో భజనలు చేస్తున్న రాముని భక్తులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



రామాయంపేట(మెదక్): శోభాయాత్రలో మహిళలు, భక్తులు

దాతలు ముందుకురావడం అభినందనీయం

డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి డా.రాధాకిషన్ అన్నారు. పాఠశాల ఆవరణలో రూ.70లక్షల వ్యయంతో నిర్మించిన సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి లక్షల ఖర్చుతో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయ భవనం నిర్మించడమే కాకుండా సైన్స్ పరికరాలు, పుస్తకాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం శాంత ఫౌండేషన్ లండన్ ప్రతినిధి విజయభాయ్ పటేల్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు పూర్తిసహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, అంకిరెడ్డి గారి కేశవరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు రామలక్ష్మి, ప్రణీతరెడ్డి, సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూపాలి, ప్రకాశ్, శాంత ఫౌండేషన్ ప్రతినిధులు బికుభాయ్ పటేల్, స్మితభాయ్ పటేల్, శశి జాన్ పటేల్, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, హెచ్‌ఎం ముంతాజ్ అలీ పాల్గొన్నారు.

పాలకమండలికి ఘన సన్మానం



కార్యదర్శి కృష్ణను సన్మానించిన పాలకవర్గ సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ పాలకమండలిని సోమవారం పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఘనంగా సన్మానించారు. ఎంపీపీ వినోదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెలతో పంచాయతీ పాలకవర్గమైన సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిస్తుండడంతో సోమవారం చివరి సమావేశం నిర్వహించారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించగా.. పాలకవర్గ సభ్యులు కూడా కృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఉప సర్పంచ్ హన్మంతు, వార్డు సభ్యులు రామకృష్ణ, శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు పండరి, అనిల్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

'తపాస్‌పల్లి'తో చెరువులు నింపాలి



మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతం కావడంతో చెరువుల్లో నీరు లేక భూగర్భజలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని చేర్యాల ప్రాంత రైతాంగానికే అందించాలి కానీ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వారి ప్రాంతాలకు అక్రమంగా తరలించుకుపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత రైతులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయర్ నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు భూమయ్య, యాదగిరి, కనకయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఎస్టీయూ సహాధ్యక్షుడికి అభినందనలు



శివప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా సహాధ్యక్షుడుగా నియామకమైన సూరారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్‌ను ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్, అక్బర్, ప్రవీణ్, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ ఉపాధ్యాయుడు జిల్లాస్థాయిలో నియామకం కావడం అభినందనీయమన్నారు.

మాంసం దుకాణాల మూసివేత

శివ్వంపేట(నర్సాపూర్): అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో సోమవారం మాంసం దుకాణాలు మూసివేశారు. గ్రామంలోని ఆలయాలలో నిర్వహిస్తున్న పూజలు, అభిషేకాలు, శోభాయాత్రల వల్ల ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉండాలనే సంకల్పంతో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేశారు.

ఏడాదిన్నర తర్వాత పోస్టుమార్టం

చేగుంట(తూప్రాన్): ఏడాదిన్నర క్రితం మృతి చెందిన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జులై 2022లో గ్రామానికి చెందిన కావేటి కిష్టయ్య మృతి చెందాడు. ఆయన సహజంగా మృతి చెందినట్లు భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే కిష్టయ్యది హత్య అనే అనుమానాలు ఉన్నట్లు ఇటీవల జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు అందింది. దీంతో స్పందించిన పోలీసులు సోమవారం పూడ్చిన స్థలం నుంచి కిష్టయ్య మృతదేహాన్ని బయట కుతీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని, నివేదిక ప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

31న గద్దర్ విగ్రహావిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కొల్లూరి సత్తయ్య, నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో ఈ నెల 31న ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహావిష్కరణ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ప్రొఫెసర్ కంచ ఐలయ్య, గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్యతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. గద్దర్ గళం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతో పాటు అనేక మంది మేధావులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా షేక్ హుస్సేన్ ఉర్సు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో గల ప్రసిద్ధ దర్గా షేక్ హుస్సేన్ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. 'పెద్ద గుట్ట' షేక్ హుస్సేన్‌కు ప్రతీకగా ఈ దర్గాను గ్రామంలో నెలకొల్పారు. ఉత్సవాల్లో భాగంగా దర్గాకు గంధం, పువ్వులు, చాదర్ ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతాలకు అతీతంగా ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. దర్గా ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ దేవీదాస్

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఏఎస్‌ఐ దేవీదాస్ చెప్పారు. సోమవారం 161 జాతీయ రహదారి చిల్వెర ఐబీ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయవద్దని, ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్



ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న గజ్వేల్ మండల నోడల్ అధికారి కృష్ణ

గజ్వేల్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో సోమవారం హైస్కూల్ స్థాయి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండలంలోని 15 పాఠశాలల్లో ఈ టెస్ట్ జరిగింది. గజ్వేల్ మండల నోడల్ అధికారి కృష్ణ చేతుల మీదుగా ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయినులు అనురాధ, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

దుబ్బాకటౌన్: పట్టణంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశంలో గొప్పస్థాయిలో ఉండడం సంతోషకరమన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ, రాష్ట్రస్థాయి వాలీబాల్ టీంకు ఎంపిక కావడంతో వారిని ఘనంగా సన్మానించారు.